ఓపికగా విని.. భరోసానిచ్చి

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి బాధితులు తరలివచ్చారు. పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు పాలనాధికారి అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరందు, శిక్షణ ఐఏఎస్ సంకేత్, ఆర్డీవో రాజేంద్రకుమార్, ఇన్‌ఛార్జి డీపీవో శ్రీనివాస్, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డిలు ప్రజల నుంచి 84 అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలు ఓపిగ్గా వింటూ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలి..

ప్రభుత్వం కేటాయించే రెండు పడక గదుల, ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి ప్రతినిధులు కోరారు. చాలా మంది దివ్యాంగులు అద్దె ఇళ్లల్లో ఉంటూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ ఉన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్, అధికారులు

పోస్టులు భర్తీ చేయాలి

డీఎస్సీలో ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజికల్ పోస్టులు భర్తీ చేయాలని నిరుద్యోగులు కోరారు. జాబ్ క్యాలెండర్ ద్వారా భర్తీ చేసి తమకు న్యాయం చేయాలని నిరుద్యోగుల అసోసియేషన్ ప్రతినిధి నందిని విన్నవించారు.

ఈవీఎం గోదాం పరిశీలన

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ శివారులోని ఈవీఎం గోదాంను పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం పరిశీలించారు. లోపల భద్రపర్చిన బ్యాలెట్, కంట్రోల్, వీవీప్యాట్లను సీసీ కెమెరా ద్వారా పరిశీలించారు. భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అగ్నిమాపక అధికారి నర్సింగ్‌రావు, ఎన్నికల విభాగం సిబ్బంది పవన్, సాత్విక్ ఉన్నారు.

ఈనాడు

నిజామాబాద్

మంగళవారం అక్టోబరు 8, 2024



బాడ్సిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు

ఓ పువ్వుల బొమ్మా.. శివుని ముద్దుల గుమ్మా

'ఓ పువ్వుల బొమ్మా.. శివుని ముద్దుల గుమ్మా.. నీ కోసం పూచెనె తంగేడు కొమ్మ..' అంటూ ఆడపడచులు ఆడిపాడారు. పిల్లజెల్లను చల్లంగా చూడు గౌరమ్మ అంటూ వేడుకున్నారు. భక్తిపారవశ్యంతో బతుకమ్మకు పూజలు నిర్వహించారు. చెరువులకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. మళ్లీ రావే తల్లి అంటూ కొలిచారు. మోపాల్ మండలం బాడ్సి గ్రామంలో సద్దుల బతుకమ్మ సందర్భంగా అతివలు ఆడిపాడుతుండగా తీసిన చిత్రమిది. - **న్యూస్‌టుడే, మోపాల్**

సమాచారం కనిపించదు.. సిబ్బంది స్పందించరు

ఈనాడు, నిజామాబాద్

లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిశీలన సాంకేతిక చిక్కులతో నత్తనడకన సాగుతోంది. తనిఖీ బృందాల్లోని ఉద్యోగులకు ఇతర విధులు కేటాయిస్తుండటంతో ప్రక్రియ పూర్తవ్వాలంటే నెలలు పట్టేలా ఉంది. ఇన్నాళ్లు పరిశీలించి పూర్తిచేసిన దరఖాస్తులూ అరకొరగానే ఉన్నాయి. యాప్‌లో తలెత్తిన సమస్యలపై ఉన్నత స్థాయికి నివేదించినా లోపాలు సవరణలో జాప్యమవుతోంది.

కష్టతరంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

ఎల్-2 దశలో కదలిక లేదు..


ఎల్-1 దశలో తనిఖీ బృందం క్షేత్రస్థాయికి వెళ్లి స్థలం హద్దులు, దస్తావేజులు సరిచూసి యాప్‌లో నమోదు చేస్తారు. మున్సిపాలిటీలో పట్టణ ప్రణాళిక విభాగం, పంచాయతీలో కార్యదర్శి ఇందులో ఉంటారు. రెవెన్యూ, నీటిపారుదలశాఖ ఉద్యోగులూ అభిప్రాయం నమోదు చేయాల్సి ఉంటుంది. ఎల్-2 అధికారి వద్దకు వెళ్లినవి పరిశీలన చేసి.. ఎల్-3 అధికారికి పంపడం లేదు. సాంకేతిక కారణాలతో ఇలా జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఎల్-3 దశకు చేరి ఫీజు చెల్లింపు వరకు వెళ్లే అర్జీల సంఖ్యలో పురోగతి లేదు.

సంఖ్యలు మారట్లే

డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ విభాగం పథకాన్ని పర్యవేక్షిస్తోంది. అంతా ఆన్‌లైన్‌లోనే ఉండటంతో సాంకేతిక బాధ్యతలు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సంస్థకు అప్పగించారు. ఇందులో భాగస్వాములయ్యే అధికారులతో



జిల్లా, రాష్ట్ర స్థాయిలో రెండు వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేశారు. జిల్లాలో కలెక్టర్‌కు లాగిన్ ఇచ్చి పురోగతి పర్యవేక్షించాలని ఆదేశాలిచ్చారు. పంచాయతీలు, మున్సిపాలిటీలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) పరిధిలో దరఖాస్తుల పరిశీలన వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేస్తున్నా.. పాతవే ఉంటున్నాయి. కొత్త డేటా కనిపించటం లేదు. ఉన్నత స్థాయికి నివేదించి నెల గడుస్తున్నా పరిష్కరించలేదని ఓ అధికారి 'ఈనాడు'తో చెప్పుకొచ్చారు.



తొమ్మిది మండలాల్లో సున్నా

తొమ్మిది మండలాల్లో పరిశీలించిన దరఖాస్తులు సున్నాగానే చూపుతోంది. వాస్తవానికి ఆయాచోట్ల కొన్నింటిని పరిశీలించారు. కానీ, డేటా నవీకరించకపోవడంతో అలాగే ఉంటోందని చెబుతున్నారు. మున్సిపాలిటీల్లో 19,552 అర్జీల్లో ఇప్పటి వరకు 99 మాత్రమే పూర్తయినట్లు చూపుతోంది. ఉన్నతాధికారులకు విషయం చెప్పామని, పోర్టల్ నిర్వాహకులు పరిష్కరించే పనిలో ఉన్నారని వివరిస్తున్నారు. ఎన్ని పూర్తయ్యాయి? ఏ దశలో ఎన్ని ఉన్నాయో? చెప్పలేని పరిస్థితి అధికారులది.

పురోగతి అంతంతే..

ప్రభుత్వం ప్రాధాన్యాంశంగా తీసుకొని అన్ని సమీక్షల్లో ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశాలిచ్చింది. జిల్లాలో పరిస్థితి చూస్తే పూర్తయినవి వందల్లోనే ఉన్నాయి. పంచాయతీల్లో కార్యదర్శులు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బందికి ఇతర పనులు అప్పగించటం మందకొడిగా సాగేందుకు ఒక కారణంగా చెబుతున్నారు. గ్రామానికి వెళ్లిన సందర్భంలో దరఖాస్తుదారు తన ప్లాటు హద్దులు గుర్తించలేని ఉదంతాలు ఎక్కువగా ఉంటున్నాయని చెబుతున్నారు.



కరెన్సీతో అమ్మవారి అలంకరణ

జిల్లా కేంద్రం కిషన్‌గంజ్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని సోమవారం కరెన్సీతో ఇలా అలంకరించారు. ఇందుకోసం రూ.20 లక్షలు ఉపయోగించినట్లు నిర్వాహకులు తెలిపారు. – ఈనాడు, నిజామాబాద్

ప్రయోగాత్మక సర్వే పూర్తి

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

ప్రభుత్వానికి నివేదించిన అధికారులు

కుటుంబ డిజిటల్ కార్డుల జారీ కోసం ప్రయోగాత్మకంగా చేపట్టిన సర్వే జిల్లాలో సోమవారంతో పూర్తయింది. ఐదు అసెంబ్లీ స్థానాల్లో నాలుగు గ్రామాలు, మూడు డివిజన్లు, మూడు వార్డులు ఎంపిక చేశారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, బల్దియాల్లో మెప్మా సిబ్బంది ఈ నెల 3వ తేదీ నుంచి సర్వే ప్రారంభించి ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ సంఖ్య సేకరించారు. రేషన్ కార్డు ఉంటే ఆ వివరాలు నమోదు చేశారు. మొత్తం కుటుంబాలు 15,429 ఉండగా అందులో 1,638 మందివి చిత్రాలు తీసుకున్నారు. సర్వే ద్వారా కొత్తగా 13,395 మంది కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేశారు.

ప్రస్తుతం ఒక ఇంట్లో ఒకే రేషన్ కార్డు ఉంది. పిల్లలకు పెళ్లిళ్లు జరిగి కుటుంబాలు ఏర్పడ్డాయి. వారికి ఇప్పటి వరకు రేషన్ కార్డు లేదు. చాలా మంది రేషన్ కార్డు కోసం పేర్లు నమోదు చేయించారు. దీంతో కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగింది. వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు.



ఆర్మూర్ పట్టణం 2వ వార్డులో సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నియోజకవర్గం	సర్వే చేసిన గ్రామం	సభ్యుల సంఖ్య	చిత్రాలు దిగినవారు	కొత్త సభ్యులు
ఆర్మూర్	రాంపూర్	214	214	78
బోధన్	లంగ్డాపూర్	237	54	254
ని.రూరల్	సాంపల్లి	301	285	353
బాల్కొండ	శ్రీరాంపూర్	208	208	268
ని.అర్బన్	3, 38, 45 డివిజన్లు	14,469	877	12,442

వచ్చింది.. వచ్చినట్లుగా..

నిజాంసాగర్ : నిజాంసాగర్ జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో నాలుగు గేట్లు ఎత్తి మంజీరలోకి విడుదల చేస్తున్నట్లు జలవనరులశాఖ ఏఈఈ శివప్రసాద్ తెలిపారు. సోమవారం 18700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో 17,000 క్యూసెక్కులు నదిలోకి, 1400 క్యూసెక్కులు ప్రధాన కాలువలోకి విడుదల చేసినట్లు చెప్పారు. పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1404 అడుగులు (17.600 టీఎంసీలు) ఉందని పేర్కొన్నారు.

సీఎంతో నియామక పత్రాల పంపిణీకి ఏర్పాట్లు

ఇంకా విడుదల కాని 1 : 1 మెరిట్ జాబితాలు


నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 ఫలితాలు ప్రకటించి దసరాలోపే నియామకపత్రాలు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు 1-5 తేదీల్లో 1:3 నిష్పత్తి ప్రకారం ధ్రువపత్రాలు పరిశీలించారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసిన అధికారులు సోమవారం సాయంత్రంలోపు 1:1 మెరిట్ జాబితాలు వెల్లడిస్తామని ప్రకటించారు. నియామకాల తర్వాత ఖాళీలు మిగలకుండా ముందుగా స్కూల్ అసిస్టెంట్ జాబితా, తర్వాత ఎస్జీటీ జాబితాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. బుధవారం ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతులమీదుగా నియామకపత్రాలు పంపిణీ చేయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అభ్యర్థులకు గుర్తింపు కార్డులు ఇచ్చి హైదరాబాద్ తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించారు. బుధవారం ఉదయం 7 గంటల్లోపు వారంతా జిల్లా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. గర్భిణి, బాలింతలు, దివ్యాంగులు ఉంటే వారితో సహాయకులు వెళ్లేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సోమవారం అర్ధరాత్రి వరకు జాబితాలు వస్తాయని, ప్రణాళికలో మార్పులు ఉండకపోవచ్చని విద్యాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

తగ్గిన ప్రమాదాలు: సీపీ

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని సీపీ కల్మేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు 625 ప్రమాదాలు జరిగితే అందులో 257 మంది మృతిచెందారని చెప్పారు. జనవరి నుంచి మే వరకు 173 మంది, జూన్ నుంచి సెప్టెంబరు వరకు 84 మంది చనిపోయినట్లు చెప్పారు. గతేడాదితో పోలిస్తే ప్రమాదాల రేటు తగ్గిందని వివరించారు. సెప్టెంబరులో కేవలం 13 మరణాలు సంభవించాయన్నారు.

విద్యుత్తు శాఖలో నిలిచిన బదిలీ ప్రక్రియ

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో సోమవారం చేపట్టాల్సిన ఉద్యోగుల బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. బదిలీలు చేపట్టాలా? వద్దా? అనేది స్పష్టత లేకపోవడంతో రాత్రి వరకు అధికారులు ఆదేశాల కోసం ఎదురుచూశారు. చివరకు నిలిపివేయాలని నిర్ణయించారు. ఏఈ నుంచి ఏడీఈ స్థాయి ఉద్యోగులకు పలువురికి పదోన్నతులు రావాల్సి ఉంది. ఈ సమయంలో బదిలీలు చేపట్టడం ఏంటని ఉద్యోగ సంఘాల నేతలు ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రత్యేకంగా కమిటీ వేసి నివేదిక ఆధారంగా బదిలీలు చేపట్టాలని సీఎండీ నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. బదిలీలు ఎప్పుడుంటాయో తెలియదని, ప్రస్తుతానికి నిలిపి వేసినట్లు ఆ శాఖ అధికారి ఒకరు 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.



వివరాలు 8లో

ఆరుతడి పైరుగా మొక్కజొన్న...

పాడి.. లాభాలు దండి

బట్టీకి స్వస్తి.. విజ్ఞానంతో దోస్తీ

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

నవంబరు 8, 9 తేదీల్లో ఇందూరులో బాలోత్సవం

బట్టీ చదువులకు స్వస్తి పలికి, ఒత్తిడిని దూరం చేస్తూ అనుభవపూర్వకంగా విద్యార్థి నేర్చుకోవాలని జనవిజ్ఞాన వేదిక సంకల్పించింది. దాదాపు 3 వేల మంది విద్యార్థులు సులువుగా గణితం నేర్చుకోవడం, మూఢనమ్మకాలను సైన్సు సాయంతో పారదోలడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇక్కడ నేర్చుకున్న అంశాలు జిల్లాలో అందరు విద్యార్థులకు చేరేలా కార్యాచరణ చేపట్టారు. ఈ నెల 2, 3 తేదీల్లో గణిత, సామాన్యశాస్త్ర ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నవంబరు 14న బాలల దినోత్సవం నేపథ్యంలో 8, 9 తేదీల్లో బాలోత్సవం నిర్వహించి 'చేస్తూ నేర్చుకోవడం.. చూస్తూ తెలుసుకోవడం.. లోకాస్ట్ - నో కాస్ట్ బోధనోపకరణాల'తో తర్ఫీదు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



అద్భుత ఫలితాలు సాధించొచ్చు



రాష్ట్రంలోని ప్రముఖులతో జిల్లా రిసోర్సుపర్సన్లకు శిక్షణ ఇచ్చాం. వారితో బాలోత్సవంలో విద్యార్థులకు తర్ఫీదు ఇస్తాం. ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకొని ఇక్కడ నేర్పిన అంశాలపై ఇతర విద్యార్థులకు అవగాహన కల్పిస్తే అద్భుత ఫలితాలు సాధించొచ్చు. - **నర్రా రామారావు, రాష్ట్ర అధ్యక్షుడు, జనవిజ్ఞాన వేదిక**

నిర్వహణ ఇలా..

ఎంపిక: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు బడుల నుంచి ముగ్గురు విద్యార్థులను పంపాలి.

మూడు విభాగాలు: రెండు రోజుల శిక్షణను మూడు విభాగాలుగా విభజించారు.

ఆనందంగా నేర్చుకోవడం: ఎంపిక చేసిన 100 మందికి గమ్మత్తుగా గణితం, క్లోజప్ మ్యాజిక్, సైన్స్ టాయ్స్, సైన్సు బిహైండ్ మిరాకల్స్ అంశాలకు రెండు రోజుల్లో మొదటి అర్ధభాగం కేటాయించనున్నారు.

సాంస్కృతిక విభాగం: విద్యార్థులకు ఉత్సాహం కలిగించేలా ఏకపాత్రాభినయం, పొట్టి డ్రామాలు, సంప్రదాయ, జానపద నృత్యాలు, పాటలు, పద్యాల గానంపై పోటీలుంటాయి. పర్యావరణ పరిరక్షణ, సీపీఆర్ ఎలా చేయాలి, రక్తదానం ప్రాధాన్యం వివరించేలా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు.

ప్రతిభా ప్రదర్శనలు: ఉపన్యాస, వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, సైన్సు ఎగ్జిబిషన్, అందమైన దస్తూరిపై పోటీలు నిర్వహిస్తారు.


★ ప్రతిభా ప్రదర్శనలు, సాంస్కృతిక విభాగాల పోటీలు మొదటిరోజు ఆరు, ఏడో తరగతి విద్యార్థులకు, రెండో రోజు 8-10 తరగతుల వారికి నిర్వహిస్తారు.

బోధన్ సుగర్స్‌కు రూ.300 కోట్లు

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రజలకు ఇచ్చిన మాట తప్పబోమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బోధన్‌లో చక్కెర పరిశ్రమ తిరిగి తెరిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.300 కోట్లు ఖర్చు చేసే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ రాష్ట్రంలో రుణమాఫీ జరగలేదని అనడం సరికాదన్నారు. మేయర్ నీతూకిరణ్, ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్‌నాయక్, కార్పొరేషన్ ఛైర్మన్లు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్, అన్వేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ నగేశ్‌రెడ్డి, గడుగు గంగాధర్, మార్కంటి లింగన్న పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రమాణ స్వీకారం

నిజామాబాద్ ఏఎంసీ ఛైర్మన్‌గా ముప్ప గంగారెడ్డి, వైస్ ఛైర్మన్‌గా రాంచందర్‌తో పాటు డైరెక్టర్లతో డీఎంవో గంగు ప్రమాణస్వీకారం చేయించారు. ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డిలు ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను కార్యాలయంలోని వారి ఛాంబర్‌లో సీట్లపై కూర్చోబెట్టారు. పాలకవర్గం సభ్యులు పెంట ఇంద్రుడు, నరేందర్‌కుమార్, రాజలింగం, బాగారెడ్డి, రాజన్న, మెగావత్ మంగ్యా, గంగారెడ్డి, దేవకర్ణ, వెంకటేశ్వరరావు, రఘువీర్, ఎండీ పాషా, మల్లేశ్, రామకృష్ణలను అభినందించారు. అనంతరం ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్‌లో రైతులకు ఇదివరకున్న భోజన క్యాంటీన్‌ను తిరిగి తెరిపిస్తానని హామీ ఇచ్చారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన తాను వారి శ్రేయస్సుకు పాటుపడతానని చెప్పారు.



ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, వైస్ ఛైర్మన్ రాంచందర్‌ను కుర్చీలో కూర్చోబెడుతున్న ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి

యథేచ్ఛగా ఇసుక దందా

- జిల్లాలోనూ కట్టడి చర్యలు శూన్యం
- అక్రమ రవాణాపై పోలీసు శాఖలో చర్చ

ఈనాడు, నిజామాబాద్

ఇసుక అక్రమ రవాణా కట్టడిలో వైఫల్యానికి బాధ్యులుగా ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలపై మల్టీజోన్-2లో వేటు పడింది. కొంతకాలంగా నిఘా వర్గాల నివేదిక ఆధారంగా ఆ జోన్ ఐజీ వీరిపై చర్యలు తీసుకున్నారు.

★ మల్టీజోన్-1 పరిధిలోనూ ఇసుక అక్రమ రవాణాపై నిఘా వర్గాలు ఇప్పటికే విచారించి నివేదికలిచ్చాయి. ఇందులో మన జిల్లాలో ఇసుక, మొరం దందా చేస్తున్న 400 మందిని గుర్తించారు. వీరిని పోలీసు స్టేషన్ల వారీగా బైండోవర్ కొన్నాళ్ల కిందట చేశారు.

★ వరద ఉద్ధృతి రోజుల్లో తప్ప.. మిగతా సమయాల్లో మంజీరతో పాటు పెద్దవాగు, కప్పల వాగుల్లోంచి అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. ఈ దందాను అరికట్టడంలో విఫలమైన వారిపైనా పోలీసుశాఖ దృష్టి పెట్టిందా? అంటే అవుననే సమాధానం వస్తోంది.

మంజీర తీరంలో జోరుగా..

జిల్లాలో మంజీర తీరం ఇసుక తవ్వకాలు- రవాణాకు ప్రధాన అడ్డా. ఈ వ్యాపారం చేసేందుకు కొందరు యంత్రాలు కొనుగోలు చేస్తే.. మరికొందరు ట్రాక్టర్లు, టిప్పర్లు కొని దందా సాగిస్తున్నారు. ఆగస్టు-సెప్టెంబరులో వరద కారణంగా వ్యాపారానికి కొంత దూరంగా ఉన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మళ్లీ యథేచ్ఛగా యంత్రాలతో తోడి సమీప గ్రామ శివారుల్లో డంపులుగా పోస్తున్నారు. రాత్రి వేళల్లో పట్టణ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. కప్పల వాగు, పెద్దవాగుపై ఆధారపడి భీమ్‌గల్, ఏర్గట్ల, జక్రాన్‌పల్లి మండలాల్లో ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. స్థానిక అధికారుల పర్యవేక్షణ లేదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. మల్టీజోన్-2లో అధికారులపై చర్యల నేపథ్యంలో.. జిల్లాలో ఇసుక వ్యాపారం సాగే ప్రాంతాల్లో కట్టడిపై పోలీసుశాఖలో చర్చ మొదలైంది.



మంజీర నుంచి తరలించి పొతంగల్ శివారులో నిల్వ చేసిన ఇసుక డంపు

అక్రమానికే పెద్దపీట..

మంజీర తీరంలో ఏడు క్వారీలకు అవకాశం ఉంది. గడిచిన ఆరేళ్లుగా ఇక్కడ వేలం వేయటం లేదు. ప్రభుత్వ అవసరాల ముసుగులో కొందరు రెవెన్యూ కార్యాలయాల్లో రూ.900 టోకెన్ తీసుకొని పదుల ట్రిప్పులు తీసుకెళ్లడం ఆనవాయితీగా మారింది. రాజకీయ పలుకుబడి ఉన్నవారు స్థానిక అధికారులను మచ్చిక చేసుకోవడంతో అక్రమానికి అడ్డూఅదుపు లేకుండాపోయింది. ఒకటి, అర పట్టుకొని జరిమానా వేయడం తప్ప పూర్తిస్థాయిలో కట్టడికి కార్యాచరణ చేయలేదు. అధికారికంగా క్వారీల నిర్వహణకు ఉన్నత స్థాయి ఆదేశాలున్నా.. తహసీల్దార్ల కార్యాలయాల నుంచి టోకెన్లు చేస్తుండటంతో ఇటువైపే జిల్లా అధికారులు మొగ్గు చూపుతున్నారు. ఇటీవల ఈ అంశంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ విధానంలో టోకెన్‌ను అడ్డుపెట్టుకొని అనేక ట్రిప్పులు తోలుకోవటం అక్రమార్కులకు వరంగా మారిందనే విమర్శలను అధికారులు పట్టించుకోవటం లేదు.

గోడు వినరు.. కష్టం తీర్చరు




ఈయన పేరు ఆలూర్ మండలం డీంకపల్లికి చెందిన చిన్న భోజన్న. 2021లో చెట్టుపై నుంచి పడటంతో నడుము, కాళ్లు విరిగాయి. నాటి నుంచి మంచానికే పరిమితమయ్యారు. ఎన్ని ఆసుపత్రుల్లో చూపించినా నయం కాలేదు. రెండున్నర ఎకరాలు ఉంటే వైద్యం కోసం ఎకరంన్నర అమ్మేశారు. ఆయన భార్య బీడీలు చుట్టి ఇద్దరు పిల్లల్ని చదివిస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నారు. గతేడాది సెప్టెంబరులో 86 శాతం వైకల్యం ఉన్నట్లు సదరం ధ్రువపత్రం జారీ చేశారు. అప్పటి నుంచి పింఛను కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కలెక్టరేట్ ప్రజావాణిలో ఇప్పటికే నాలుగుసార్లు విన్నవించారు. సోమవారం మరోసారి కలెక్టర్‌ను కలిసి మొర పెట్టుకున్నారు. - **ఈనాడు, నిజామాబాద్**

పాడి.. లాభాలు దండి

న్యూస్‌టుడే, ధర్పల్లి (జక్రాన్‌పల్లి)

పంటల సాగుతో పాటు పాడి కూడా రైతులకు అధిక ఆదాయాన్ని తెచ్చిపెడుతుంది. ప్యాకెట్ పాలు మార్కెట్‌లో లభిస్తున్నా.. నాణ్యమైన గేదె, ఆవు పాలు ఆరోగ్యానికి మంచిది. పల్లెల్లో రోజురోజుకూ తగ్గుతున్న పాడి కొందరు రైతుల పాలిట వరంగా మారింది. ముర్ర జాతి గేదెల పెంపకం ద్వారా పాలు, ఇతర ఉత్పత్తులు విక్రయించి ప్రతినెలా అధిక ఆదాయం పొందుతున్నారు పలువురు రైతులు. ఇదే కోవకు చెందిన వారు జక్రాన్‌పల్లి మండలం పుప్పాలపల్లికి చెందిన యువ రైతు తౌడ రవి.



రైతు ఏర్పాటుచేసిన డెయిరీ

ఎనిమిదేళ్ల కిందట ఏర్పాటు..

రైతు రవి 2017లో రూ.15 లక్షలతో 20 ముర్రజాతి గేదెలను తెచ్చి గ్రామంలోని సొంత స్థలంలో డెయిరీని ప్రారంభించారు. మొదట కొన్ని నెలలపాటు ఇబ్బందిగా ఉన్నా నెమ్మదిగా పెంపకంపై అవగాహన పెంచుకున్నారు. ఇద్దరు కూలీలను ఏర్పాటు చేసుకున్నారు. రెండు ఎకరాల్లో సుపారీ నేపియర్ గడ్డిని పెంచి ఏడాది పొడవున గేదెలకు పచ్చి గడ్డి లేని లోటు తీరుస్తున్నారు. అలాగే పత్తి చెక్క, వరి తౌడు, పెసర చున్నీని దాణాగా పెడుతున్నారు. గేదెలు నిత్యం 100 లీటర్ల పాలు ఇస్తుండగా.. నిజామాబాద్ నగరానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఇలా ప్రతినెలా రూ.1.80 లక్షల ఆదాయం వస్తుందని రైతు చెబుతున్నారు. పాడి నిర్వహణ, దాణా, కూలీల ఖర్చులు పోనూ రూ.80 వేల లాభం వస్తుందన్నారు. ప్రతి పంటకాలం సీజన్‌లో పేడ విక్రయం ద్వారా మరో రూ.2 లక్షల పొందుతున్నట్లు చెప్పారు.

స్వయం ఉపాధితో ఆనందంగా ఉంది.

- రవి, పుప్పాలపల్లి



పదో తరగతి పూర్తి చేసిన తర్వాత స్వయం ఉపాధి కోసం పాడిపై దృష్టి పెట్టా. ఏ సీజన్‌లో పశువులకు ఎలాంటి దాణా అవసరం ఉంటుందో తెలుసుకొని అందిస్తున్నా. షెడ్డులో పరిశుభ్రంగా ఉంచితే పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. నిత్యం వినియోగదారులకు నాణ్యమైన పాలను అందించడంలో తృప్తి లభిస్తుంది.

మిత్ర పురుగులతో మేలు

బోధన్ గ్రామీణం: పంటలకు మేలు చేసే మిత్ర పురుగులను రైతులు కాపాడుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి సంతోష్‌కుమార్ తెలిపారు. ప్రధాన పంటలైన వరి, పత్తి పంటల్లో శత్రు పురుగులైన పేనుబంక, పచ్చ, తెల్ల, నల్లదోమలు మిత్ర పురుగులైన అక్షింతల పురుగు, తూనీగలు, తేనెటీగలు, సాలీడు పురుగుల నిష్పత్తి ఆధారంగా మందులు పిచికారీ చేయాలి. మందులు ఎక్కువగా చల్లితే మిత్ర పురుగులు చనిపోతాయి. వీటి వృద్ధికి ప్రధాన పంటల చుట్టూ, లేదంటే అంతరంగా కంది, బంతి, పొద్దుతిరుగుడు సాగు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు.



వరిలో కంకినల్లి ఆశిస్తుంది. నివారణ తెలుపండి? - లక్ష్మణ్, రైతు, పాతంగల్



పగటి ఉష్ణోగ్రతలు 28-30 డిగ్రీల సెల్సియస్, అధిక తేమ, అధిక ఉష్ణోగ్రతల వల్ల వస్తుంది. ఆకు మధ్య ఈనెపై లేదా ఆకు మట్ట లేదా కాండం మీద గోధుమ నుంచి నల్లటి మచ్చలు ఏర్పడుతాయి. వెన్నులు వంకర తిరగడం, లేదా పాక్షికంగా బయటకిరావడం, గింజ తయారీ దశలో గింజలపై గోధుమ లేదా నల్ల మచ్చలు ఏర్పడుతాయి. నివారణకు స్పైరోమెసిఫెన్ 1.0మి.లీ లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

- విజయ్‌కుమార్, సస్యరక్షణ శాస్త్రవేత్త, రుద్రూర్

– న్యూస్‌టుడే, కోటగిరి

ఆరుతడి పైరుగా మొక్కజొన్న

న్యూస్‌టుడే, బోధన్ గ్రామీణం : యాసంగి పంటకాలంలో కాల్వల కింద, నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో మొక్కజొన్న సాగు లాభదాయకమని బోధన్ మండల వ్యవసాయాధికారి సంతోష్ తెలిపారు. మెట్టభూముల్లో బోరుబావుల ఆధారంగా వరి సాగుచేసే రైతులు కూడా మొక్కజొన్న సాగు చేయవచ్చన్నారు. ఆరుతడి సాగులో వరితో సమానంగా ఆదాయాన్ని ఆర్జించొచ్చని అక్టోబర్ 15 నుంచి జనవరి రెండోపక్షం వరకు సాగుచేయవచ్చని వివరించారు.

అనువైన నేలలు: మురుగునీరు నిలువని నల్లరేగడి నేలలు, సారవంతమైన ఎర్ర నేలలు అనుకూలం.

నేల తయారీ: మెత్తగా దుక్కి చేసి, చివరి దుక్కిలో ఎకరానికి పది టన్నుల పశువుల ఎరువు వేస్తే దిగుబడులు పెరుగుతాయి.

విత్తన మోతాదు: ఎకరానికి ఎనిమిది కిలోల విత్తనం అవసరం.

విత్తే విధానం: వరుసల మధ్య 60 నుంచి 75 సెం.మీ, మొక్కల మధ్య 20 నుంచి 30 సెం.మీ (ఎకరానికి సగటున 20వేల నుంచి 30వేల మధ్య మొక్కలు ఉండేలా చూడాలి) బోదె పద్ధతి మంచిది.

ఎరువులు: ఎకరానికి 50కిలోల నత్రజని, 25 కిలోల భాస్వరం, 25కిలోల పొటాష్ వేయాలి. నత్రజని మూడుభాగాలుగా విభజించి విత్తే సమయంలోనూ, 30రోజుల దశలో, 55రోజుల దశలో ఒక్కో భాగం చొప్పున వేయాలి. సూక్ష్మ లోపాలు తలెత్తకుండా ఎకరానికి 10కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలి.



నీటి తడులు: పైరు విత్తిన 15 రోజులకు ఓసారి భూమిలో తేమను బట్టి నీటితడులు ఇవ్వాల్సి ఉంటుంది. నీరుపారించే సమయంలో ఎక్కువ రోజులు నీరు నిల్వకుండా సాగుదారులు జాగ్రత్తలు తీసుకోవాలి.

సస్యరక్షణ: మొవ్వతొలిచే పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ గుళికలను పూతదశకు ముందుగా మొక్కకు నాలుగేసి గుళికల వంతున మొవ్వల్లో వేయాలి.

మదినిండా జానపదమే

రామరామ ఉయ్యాలో..
రామనే శ్రీరామ ఉయ్యాలో
నెత్తిమీద సూర్యుడా ఉయ్యాలో
నెలవన్నెకాడ ఉయ్యాలో
పూలతల్లి గౌరమ్మ ఉయ్యాలో
తంగెడుపూల గౌరమ్మ ఉయ్యాలో
ఇలా అమ్మవారిని కీర్తిస్తూ మహిళలు పాటలు పాడుతూ బతుకమ్మ ఉత్సవాల్లో సందడి చేస్తున్నారు.

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

బతుకమ్మ సందడి అంటే డీజే పాటలు, రకరకాల స్టెప్పులతో వేడుకలు జరుపుకోవడం సాధారణమైపోయింది. కానీ, జానపద పాటలను నోటితో ఆలపిస్తూ సంప్రదాయ బద్ధంగా ఆడుతూ స్ఫూర్తినిస్తున్నారు పలువురు మహిళామణులు. ఏటా ఇదే తరహాలో వేడుకల్లో పాల్గొంటూ ఇతరులను భాగస్వామ్యం చేస్తున్నారు. మరికొందరు విశ్వవిద్యాలయ స్థాయిలో బతుకమ్మ పండగ ప్రత్యేకతపై పరిశోధన చేస్తున్నారు. పలు వేదికలపై వ్యాసాలు సమర్పించారు. ఇలాంటి వారిని ఆలయ కమిటీలు, బృందాల సభ్యులు గౌరవిస్తున్నారు.

పుస్తకంగా తీసుకొస్తా..

శకుంతల, నాందేవ్‌వాడ, నిజామాబాద్

మా సొంతూరు లింగంపేట, రాజన్న సిరిసిల్ల జిల్లా. వ్యాపార నిమిత్తం ఇందూరుకు వచ్చాం. మా అమ్మ భూమవ్వ, అత్తమ్మ లక్ష్మిల ద్వారా 25 బతుకమ్మ పాటలు నేర్చుకున్నా. అక్కమ్మ, గౌరమ్మ, బతుకమ్మ వీడ్కోలు పాటలు పాడడం ఇష్టం. నాందేవ్‌వాడ, కిషన్‌గంజ్‌లో జరిగే వేడుకలకు నన్ను ఆహ్వానిస్తారు. నా పాటలను త్వరలో పుస్తకంగా తీసుకొస్తా.



మహిళలతో కలిసి పాటలు పాడుతున్న శకుంతల

పాటలోని అర్థం తెలుసుకోవాలి

- తోట నవీన, బోర్గాం(పీ), నిజామాబాద్



మాది అంక్సాపూర్. అమ్మ గంగుబాయి ద్వారా పాటలు నేర్చుకున్నా. 35 ఏళ్లుగా అమ్మవారి పాటలు పాడుతున్నా. సద్దుల బతుకమ్మ రోజు తప్పకుండా ఇంటికొకరు బతుకమ్మ సంబరంలో పాల్గొంటారు. కుటుంబ బంధాలు, ఆత్మీయత, గౌరమ్మ గొప్పతనం చాటుతూ పాటలు పాడుతుంటా. పాటల్లో ఎంతో అర్థం దాగి ఉంటుంది. అది తెలుసుకుని ఆలపిస్తా.

పరిశోధన చేశా..

- శారదా హన్మాండ్లు, ఉపాధ్యాయిని, వడ్డేపల్లి జడ్పీ స్కూల్

ప్రభుత్వ ఉపాధ్యాయినిగా ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్నప్పుడే అక్కడి బతుకమ్మ వేడుకల్లో మహిళలు పాడే పాటలు తెలుసుకున్నా. వీటిపై విశ్వ విద్యాలయాల స్థాయిలో పరిశోధన చేయాలని భావించా. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లో తిరిగి వందకు పైగా పాటలు సేకరించా. తెలంగాణ విశ్వవిద్యాలయం నుంచి 2018లో బతుకమ్మ సాంస్కృతిక పునరుజ్జీవనం అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా అందుకోవడం సంతోషంగా అనిపిస్తుంది.



వడ్డేపల్లి పాఠశాల చిన్నారులతో శారదా హన్మాండ్లు



అయోధ్య మందిరం.. అలంకరణ అద్భుతం

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో ఏర్పాటుచేసిన దేవీ మాత మండపాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. నిర్వాహకులు నిత్యం కొత్త ఆలోచనలకు పదును పెడుతూ అలంకరణలతో మండపాలను ముస్తాబు చేస్తున్నారు. నిజామాబాద్ వినాయకనగర్‌లోని తొలి మహిళా మేయర్ వీధిలోని అయోధ్య రామాలయం ఆకారంలో విద్యుత్తు దీపాలతో రూపొందించిన మండపం చూపరులకు కనువిందు చేస్తోంది.

– ఈనాడు, నిజామాబాద్, న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం



రోడ్డు ఇరుకు.. సూచికలు కరవు

బోధన్ బైపాస్ రోడ్డులో పాండుచెరువు అలుగు వద్ద మూలమలుపు ఉంది. ఇక్కడ ఇరుకైన రహదారి కావడం, అందులోనూ కల్వర్టుకు రక్షణ గోడ లేకపోవడంతో దూసుకొచ్చే వాహనదారులు ఏమరపాటుగా వ్యవహరిస్తే అలుగు గుంతలో పడే ప్రమాదముంది. ప్రమాద నివారణకు కల్వర్టు వద్ద సూచికలు, రక్షణ గోడ నిర్మించాల్సిన అవసరముంది.

– న్యూస్‌టుడే, బోధన్

వసూలు కాని అప్పు.. సొంత వాహనానికి నిప్పు

● మిత్రుడి మీద కోపంతో బోధన్ ఠాణా ఎదుట హంగామా

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే : స్నేహితుడు అప్పుగా తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వడం లేదని విసుగు చెందిన వ్యక్తి తన ద్విచక్రవాహనాన్ని తానే దహనం చేసుకున్న ఘటన బోధన్ ఠాణా ఎదుట సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. బోధన్ పట్టణానికి చెందిన హరిదాస్ తన స్నేహితుడు శంకర్‌కు రెండేళ్ల కిందట అప్పు ఇచ్చాడు. తనకు రావాల్సిన రూ.80వేలు తిరిగి ఇవ్వాలని కోరినా స్పందించడం లేదని పోలీసులను ఆశ్రయించాడు. ఈ విషయం తమ పరిధిలోకి రాని అంశమని పోలీసులు సూచించగా.. తనకు న్యాయం కావాలంటూ అక్కడే ఆవేశంతో తన వాహనానికి నిప్పంటించాడు. ఠాణా ఎదుట హంగామా సృష్టించినందుకు హరిదాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకట్‌నారాయణ తెలిపారు. పోలీసులు మంటలు అదుపు చేయడంతో బండి స్వల్పంగా కాలిపోయింది.



నగల దుకాణం ప్రారంభం

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో సీఎంఆర్ జ్యువెలరీ షోరూంను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సోమవారం ప్రారంభించారు. నగర మేయర్ నీతూకిరణ్ జ్యోతి వెలిగించారు. 46వ డివిజన్ కార్పొరేటర్ అక్బర్ హుస్సేన్ హాజరయ్యారు. సీఎంఆర్ గ్రూప్ ఫౌండర్, ఛైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో అతి పెద్ద బంగారు ఆభరణాల షోరూం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.



రిబ్బన్‌ను కత్తిరిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

కొనసాగుతున్న ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని హిందీ ఆదర్శ పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలకు పలువురు గైర్హాజరైనట్లు డీఈవో దుర్గాప్రసాద్, సమన్వయకర్త రవీందర్ తెలిపారు. ఉదయం జరిగిన పదో తరగతి సాంఘిక శాస్త్రానికి 74కి 58మంది, ఇంటర్మీడియెట్ చరిత్ర సబ్జెక్టులో 46కి 43 మంది హాజరైనట్లు చెప్పారు. మధ్యాహ్నం పదో తరగతి ఉర్దూ పరీక్షకు 15కి 12, ఇంటర్మీడియెట్ గణితానికి 15కి 14మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

గోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మారయ్యగౌడ్



నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని నీరా కేఫ్‌లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో నిర్వహించిన గౌడ ఆఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లాకు చెందిన ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల ఛైర్మన్ మారయ్యగౌడ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లాలోని గౌడ్ యువజన సంఘ సభ్యులతో పాటు పలువురు ఆయనను అభినందించారు.

చోరీ కేసులో ఒకరికి జైలు శిక్ష

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: దొంగతనం కేసులో ఓ నిందితుడికి సోమవారం ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వేముల దీప్తి జైలు శిక్ష విధించారు. ఏర్గట్ల శివారులోని శివాలయంలో 2023 డిసెంబరులో జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం హుస్సేన్ నగర్‌కు చెందిన షైక్ బాబు(25) చోరీకి పాల్పడ్డాడు. గుడి తాళాలు పగలగొట్టి ఇత్తడి గంటలు ఎత్తుకెళ్లాడు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్సై మశ్చేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఛార్జిషీట్ దాఖలు చేయడంతో ఏపీపీవో రామకృష్ణ 8 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి రుజువు చేశారు. జడ్జి వేముల దీప్తి నేరస్థుడు షైక్ బాబుకు ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు.

తనయుడికి తల్లి అంత్యక్రియలు

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: పొట్టచేతపట్టుకొని ఉపాధి నిమిత్తం దుబాయి వెళ్లిన కుమారుడు తిరిగొచ్చి తనను బాగా చూసుకుంటాడని తలచింది ఆ తల్లి. కానీ విధి ఆ మాతృమూర్తి ఆశలను చిదిమేసింది. కుమారుడిని మృతదేహం రూపంలో పంపించి ఆ తల్లికి కడుపుకోత మిగిల్చింది. తండ్రి లేని బిడ్డకు ఆమెనే అంత్యక్రియలు నిర్వహించాల్సి రావడం చూపరులను కంటతడి పెట్టించింది. ఇందల్‌వాయి గ్రామానికి చెందిన సున్నం రమేశ్(30) గత నెల 14న గుండెపోటుతో మృతిచెందారు. గల్ఫ్ సేవా రక్షణ సమితి సభ్యుల కృషితో మృతదేహం సోమవారం స్వగ్రామం చేరింది. ఇదివరకే రమేశ్ తండ్రి మృతి చెందడంతో కుమారుడి చితికి తల్లి భారతి నిప్పంటించి అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చింది.



రమేశ్



పాడె ముందు నడుస్తున్న రమేశ్ తల్లి భారతి

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

వన్యప్రాణుల లెక్కింపు

సిర్పూర్ (మోపాల్) : సిర్పూర్ అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల లెక్కింపును సెక్షన్ అధికారులు బాసిత్, సాయికుమార్ చేపట్టారు. 70వ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా సోమవారం అటవీ ప్రాంతంలో పర్యటించారు. బీట్ అధికారులు ఉదయ్, లింగన్న, లింబాద్రి, విజయభారతి, ప్రవీణ్, బేస్‌క్యాంప్ సిబ్బంది రవి, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి సన్మానం

బోధన్ : ఎనిమిదేళ్లుగా బోధన్ శ్రీచక్రేశ్వరాలయంలో పనిచేసి పదోన్నతిపై వెళుతున్న రాములను ఆలయ అర్చకులు సోమవారం సత్కరించారు. జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన ఆయనకు రెండు రోజుల కిందట ఈవోగా పదోన్నతి లభించింది. ప్రధాన అర్చకుడు గణేశ్ మహరాజ్, మహేష్ పాఠక్, శివ మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నాలుగో తరగతి కార్యవర్గ సభ్యులు

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కార్యవర్గం నూతనంగా ఎన్నికైంది. ఈ మేరకు సభ్యులు సోమవారం పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతును మర్యాదపూర్వకంగా కలిశారు. టీఎన్జీవోస్ రాష్ట్ర నాయకుడు గంగారాం తదితరులు ఉన్నారు.



మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048



సమస్య : బోధన్ గోశాలరోడ్డులోని వీధిలో మురుగు కాల్వ వ్యర్థాలు, పొదలతో పేరుకుపోయింది. **- స్థానికుడు, బోధన్**



సమస్య : బోధన్ రైల్వేకమాన్ సమీపంలోని మిఠాయి దుకాణం వద్ద చెత్త తొలగించాలి **- కలీం, బోధన్**

పరిష్కారం : ఈ సమస్యలను శానిటరీ జవాన్ గాబ్రియెల్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బంది చేత చెత్త తొలగించి, మురుగు కాల్వ శుభ్రం చేయించి సమస్య పరిష్కరించారు.

సమస్య: సాలూరలోని మజీద్ కాలనీ వద్ద చెత్తాచెదారం ఉంది. **- రమేష్, సాలూర**



పరిష్కారం: ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ దృష్టికి తీసుకెళ్లగా పారిశుద్ధ్య సిబ్బంది చేత తొలగింపజేయించారు.

స్పందన: తుల్జాభవానీ ఆలయ సమీపంలోని భవానీనగర్ రోడ్‌నం-6లో పైప్‌లైన్ పగిలి నీరు వృథా పోవడంపై స్థానికుడు నగేష్ ఈనాడు దృష్టికి తేగా నగరపాలక సంస్థ ఏఈ వాజిద్ స్పందించి మరమ్మతు చేయించారు.

సమస్య: నగరంలోని రైల్వే ఫ్లైఓవర్‌పై పశువులు గుంపులుగా ఉండటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది.
- కృష్ణ, నాందేవ్‌వాడ

సమాధానం: ఇప్పటికే పలువురు యజమానులకు నోటీసులు ఇచ్చాం. రోడ్లపైకి వదిలితే జరిమానాలు విధిస్తాం.
- ప్రశాంత్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

న్యూస్‌టుడే, నిజామాబాద్ వైద్యవిభాగం, బోధన్, సాలూర

₹ 8.5 కోట్ల బకాయిలకు నిరీక్షణ!

న్యూస్‌టుడే, బోధన్

బోధన్ బల్దియా బిల్లుల బకాయిలతో సతమతమవుతోంది. గుత్తేదారులకు ఏకంగా రూ.8.5కోట్లు చెల్లించాల్సి ఉంది. పాలకవర్గం గడువు మరో నాలుగు నెలలే ఉండటంతో ఆలోగా నిధులు వచ్చేనా? అన్న మీమాంసతో గుత్తేదారులు ఉన్నారు. ఇదంతా పట్టణ ప్రణాళికలో చేసిన ప్రగతి పనుల జాబితానే కావడం గమనార్హం.

ఇదీ నేపథ్యం..

2020 జనవరిలో పురపాలక ఎన్నికలు నిర్వహించారు. పురపాలక చట్టం 2019 ఆధారంగా పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని నాటి ప్రభుత్వం చేపట్టింది. అందులో భాగంగా రాష్ట్ర ఆర్థిక సంఘం, 15వ ఆర్థిక సంఘం నిధులను కలిపి ప్రతి నెలా పురపాలికలకు నిధులు కేటాయిస్తామని ప్రభుత్వం చెప్పింది. ఈ మేరకు బోధన్ బల్దియాకు 2020 ఫిబ్రవరి నుంచి కొద్ది నెలలు రూ.72లక్షల చొప్పున చెల్లించింది. ఈ నిధులతో వైకుంఠధామాలు, మౌలిక వసతుల కల్పన వంటి పనులకు నిర్దేశించారు. పాలకవర్గం ప్రతి నెలా రూ.72లక్షల చొప్పున నిధులొస్తాయనుకుని.. ఆ మేరకు పనులు ప్రతిపాదించి చేసుకుంటూ వెళ్లారు. క్రమంగా నెలవారీ నిధుల్లో కోత మొదలైంది. అలా వచ్చే నిధులు తక్కువ, ప్రతిపాదించి చేపట్టిన పనుల విలువ పెరిగింది. దీంతో చేసిన పనులకు చెల్లించే బిల్లుల అంతరం పెరుగుతూ బకాయిలు పేరుకున్నాయి. ఆ విలువ రూ.8.5కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం నాటికి రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి రూ.12.34కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.15.87కోట్లు వచ్చాయి. వీటిని ఆయా పనులకు చెల్లింపు జరిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.80కోట్లు విడుదల చేశారు. బకాయిలు పేరుకోవడంతో గుత్తేదారులు పలుమార్లు జిల్లా, పురపాలక శాఖ అధికారులను సంప్రదించి నిధులు విడుదల చేయాలని కోరారు. ఒక దశలో తాము కొత్త పనులు చేపట్టబోమని స్పష్టం చేశారు. బకాయిల కోసం ధర్నా నిర్వహించారు. తాజాగా పాలకవర్గం పదవీకాలం ముగియనుండటంతో గుత్తేదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ బకాయిల కారణంగా సాధారణ నిధులతో చేపట్టాల్సిన అత్యవసర పనులకు ఎవరూ ముందుకు రావడంలేదు. అది తాగునీటి సరఫరా వ్యవస్థ వంటి వాటిపై ప్రభావం చూపిస్తోంది.



ప్రభుత్వం నుంచి స్పష్టత లేక పాలకవర్గం మౌనంగా ఉంటోంది. ఇటు అధికారులు ఏదీ చెప్పలేకపోతున్నారు. తదుపరి ప్రగతి పనులపై ప్రభావం పడకుండా నిధులు విడుదల చేయాలని పాలకవర్గ సభ్యుల్లో కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న అన్నదానం

నిజామాబాద్ న్యాయవిభాగం న్యూస్‌టుడే: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం జిల్లా కోర్టులో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం జిల్లా జడ్జి కుంచాల సునీత పాల్గొని కక్షిదారులకు స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం జిల్లా జడ్జి మాట్లాడుతూ.. ఇప్పటికీ 18వ వారం పూర్తి అయిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి పద్మావతి, లైజన్ అధికారి శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న జిల్లా జడ్జి కుంచాల సునీత

10న విజయ దశమి

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10న జిల్లాకేంద్రం హరిచరణ్ మార్వాడీ విద్యాలయంలో విజయ దశమి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు నగర కార్యవాహ అర్గుల సత్యం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది వేడుకల సందర్భంగా జరిపే ఈ ఉత్సవాల్లో ప్రధాన వక్తగా హిందూజాగరణ మంచ్ అఖిల భారత సహ సంఘటనా మంత్రి దేవేందర్‌రెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

ఊరికి ఉత్తరాన వలలో..

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: బతుకమ్మ సంబరాలు జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్నాయి. సోమవారం బతుకమ్మలను పేర్చి మహిళలు, చిన్నారులు పూజించారు. పాటలు పాడుతూ..ఆడారు. అనంతరం స్థానిక జలవనరుల్లో నిమజ్జనం చేశారు.



కోలాటం ఆడుతున్న సీపీ కల్మేశ్వర్, అధికారులు



గంగాస్థాన్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో..



నాందేవ్‌వాడలో



భవానీపేట్‌లో..



రెంజల్‌లో..



కొండూరులో..



పెగడాపల్లిలో..



నవీపేట : నాళేశ్వర్‌లో..



మోపాల్‌లో..



డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో..



జక్రాన్‌పల్లి : తొర్లికొండలో..



నిజామాబాద్ ఆర్టీసీ డిపోలో..



జిల్లాకేంద్రంలో.. పోలీసు సిబ్బంది కుటుంబీకులు



ఎడపల్లిలో..



చందూర్‌లో..

14 వరకు ఉత్సవాలు

ఖలీల్‌వాడి : ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈ నెల 14 వరకు అంతర్జాతీయ వస్తు సేవల నాణ్యత ప్రమాణాల ఉత్సవాలు కొనసాగుతాయని నిజామాబాద్ అదనపు మున్సిపల్ కమిషనర్ శంకర్ తెలిపారు. సోమవారం సంబంధిత కరపత్రాలను విడుదల చేశారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సంఘాలతో కలిసి ఆహార భద్రతా కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు వీఎస్ వర్మ, సంయుక్త కార్యదర్శులు శ్రీనివాస్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఖరారైన అభ్యర్థులు

బోధన్, న్యూస్‌టుడే : బోధన్ పట్టణాభివృద్ధి కమిటీకి నిర్వహించనున్న ఎన్నికల్లో పోటీదారులు ఖరారయ్యారు. ఇటీవల వివిధ పోస్టులకు 27మంది నామపత్రాలు సమర్పించారు. చివరకు 17 మంది పోటీలో నిలిచారు. ఈ నెల 9న ఎన్నికలు నిర్వహించనున్నారు.



యజ్ఞం నిర్వహిస్తున్న వేదపండితులు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

బోధన్ గ్రామీణం : మావందిఖుర్దులోని మహాలక్ష్మి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించి మహాలక్ష్మి, పోతరాజు విగ్రహాలు ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించి అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రాములు, చిత్రకుమార్, మనోహర్, రాజు, సాయికుమార్, శివ పాల్గొన్నారు.

మొరం తవ్వకాలపై చర్యలు తీసుకోండి

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : సారంగపూర్ అటవీ ప్రాంతంలో అక్రమంగా మొరం తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భారాస నాయకులు అక్బర్ నవాజుద్దీన్, వల్లెపు రాజు పాలనాధికారి రాజీవ్ గాంధీ హన్మంతునకు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామ శివారు అటవీ ప్రాంతం నుంచి రాత్రి వేళల్లో మొరం తరలిస్తూ పంట కాలువలను పూడ్చివేస్తున్నారని పేర్కొన్నారు.

నిలిచిన సరఫరా.. ప్రజల ఆందోళన

ధర్పల్లి : ధర్పల్లి ఉపకేంద్రంలో విద్యుత్తు సరఫరాను వదిలే పరికరాలు మూడు సోమవారం ఉదయం చెడిపోయాయి. దీంతో ధర్పల్లి, సీతాయిపేట్ గ్రామాలకు సరఫరా నిలిచి ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డీఈఈ ఉత్తమ్‌జాదవ్, ఏడీ శ్రీనివాస్ కొత్తవి తెప్పించి మరమ్మతులు చేయించారు. విద్యుత్తు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డామని ఇప్పటికైనా ఈ విద్యుత్తు కేంద్రాన్ని 133 కేవీ విద్యుత్తు ఉపకేంద్రంగా మార్చాలని ప్రజలు అధికారులకు విన్నవించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి

రెంజల్ : వరికోతలు ఊపందుకున్నందున కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని అఖిలభారత ప్రగతిశీల రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో నాగన్న, ఒడ్డెన్న, రాజేశ్వర్, గోపాల్, గంగాధర్, పోశెట్టి, రవి, సుదర్శన్‌గౌడ్ ఉన్నారు.

కబ్జాకు గురైన భూములు కాపాడాలి

రుద్రూర్, న్యూస్‌టుడే : రుద్రూర్ మండలం కొండాపూర్ శివారులో కబ్జాకు గురైన భూమిని కాపాడాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రుద్రూర్‌లోని మండల పరిషత్ సమీకృత భవనం ఎదుట వారు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు.

పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: భాజపా సంస్థాగత నిర్మాణంలో భాగంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ తెలిపారు. జిల్లాకేంద్రంలో ఓబీసీ మోర్చా అర్బన్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్‌లో తప్పనిసరి 200 మంది సభ్యులు భాజపాలో చేరేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఆనంద్ గౌడ్‌ను జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి శాలువాతో సన్మానించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామియాదవ్, నాయకులు సుదర్శన్, శంకర్, కిశోర్, నాగరాజు, గిరిబాబు ఉన్నారు.

దాడులు ఆపాలని నిరసన

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సోమవారం సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్, సీపీఐయూ ఆధ్వర్యంలో ఇజ్రాయెల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌బాబు, శివ, లింగం, ఓమయ్య, రాజన్న, నూర్జహాన్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆదిపరాశక్తి.. ఆదుకోవమ్మా

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు సోమవారం మహా చండీమాతగా దర్శనమిచ్చారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అమ్మవారి మండపాల్లో భక్తులు పూజలు, కుంకుమార్చనలు చేశారు. సామూహిక లలితాసహస్రనామ పారాయణాలు చేశారు.

– నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే



నవీపేటలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు




బోధన్ సరస్వతీనగర్ కాలనీలో..



న్యావనందిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



బోధన్ శర్బతీకెనాల్ రోడ్డులోని వీధిలో..



నవీపేట : శివాజీనగర్‌లో..



నగరంలోని చంద్రశేఖర్‌కాలనీలో



పొతంగల్‌లో..



వర్ని : నెహ్రూనగర్‌లో..



డిచ్‌పల్లి గ్రామీణం: ఘన్‌పూర్‌లో..



జక్రాన్‌పల్లిలో.. అన్నదానం



ఎడపల్లిలో..



ధర్పల్లిలో..

గుంతల పూడ్చివేత

ఈనాడు కథనానికి స్పందన

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: మండలకేంద్రంలోని 44వ నంబరు జాతీయ రహదారి నుంచి నల్లగుట్టతండాకు వెళ్లే పంచాయతీరాజ్ రహదారిపై పడ్డ గుంతలను అధికారులు కంకరతో పూడ్చివేయించారు. 'కంకర తేలి.. గుంతలు ఏర్పడి' అనే శీర్షికన సెప్టెంబరు 13న 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్రకథనానికి అధికారులు స్పందించారు. రహదారి పూర్తిస్థాయి నవీకరణకు నిధులు మంజూరు వచ్చేలోపు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినట్లు పీఆర్ ఏఈ సురేంద్రవర్మ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.



నీటి సమస్య పరిష్కరించాలని వినతి

సిరికొండ, న్యూస్‌టుడే: మండలంలోని గడ్కోల్ గ్రామం గుండు కాలనీలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు సోమవారం ఎంపీవో తారాచంద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎల్లయ్య, రాములు, సుభద్ర, పోశెట్టి, నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని నెహ్రూచౌక్‌లో..



బోధన్‌లో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ముస్లిం మతపెద్దలు



నవీపేటలో...

ప్రశాంతంగా బంద్

న్యూస్‌టుడే బృందం : మహ్మద్ ప్రవక్తపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వారిపై కేసు నమోదు చేయాలంటూ సోమవారం జిల్లావ్యాప్తంగా బంద్ పాటించారు. బోధన్, ఆర్మూర్, నవీపేట, ఎడపల్లి ప్రాంతాల్లో ముస్లింలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. నగరంలోని గాంధీచౌక్, బోధన్‌రోడ్డు, ఖిల్లా రోడ్డులోని దుకాణాలతో పాటు ఇతర ప్రాంతాల్లోని దుకాణాలను మూసేశారు. బంద్ ప్రశాంతంగా సాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: బోధన్ శివారులో అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందడం స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన షేక్ లాయక్ (24) ద్విచక్రవాహన మెకానిక్‌గా పనిచేసేవాడు. అతనికి పెళ్లి కాలేదు. ఆదివారం రాత్రి తోటి మిత్రులైన అర్బాజ్, మారూఫ్, జునాయిత్‌లతో కలిసి లాయక్ శివారులోని ఓ ప్రాంతానికి వెళ్లారు. వెళ్లిన వారిలో ఒక వ్యక్తి లాయక్ స్నేహితుడైన పవన్‌కు ఫోన్ చేసి నీ స్నేహితుడు గాయాలతో పడి ఉన్నాడంటూ సమాచారం అందించాడు. పవన్ వచ్చి చూసి గాయాలతో ఉన్న లాయక్‌ను దవాఖానాకు తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి తండ్రి తన కొడుకు మరణంపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. మృతుడితో వెళ్లిన ముగ్గురు పరారీలో ఉన్నారని, వారి కోసం అన్వేషిస్తున్నట్లు సీఐ చెప్పారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఎడపల్లి, న్యూస్‌టుడే: ఠాణాకలాన్ శివారులోని నిజాంసాగర్ ప్రధాన కాలువ వద్ద సోమవారం గుర్తు తెలియని వ్యక్తి (55) మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. మృతుడు కుర్నాపల్లి దర్గా వద్ద భిక్షాటన చేసేవారని వివరించారు. మృతుడి వివరాలు తెలిస్తే ఠాణాలో సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని బోధన్ ప్రభుత్వ దవాఖానాకు తరలించామని చెప్పారు.

గొళ్లెం తొలగించి..చోరీ చేసి

నవీపేట, న్యూస్‌టుడే: మట్టయ్యఫారంలోని ఓ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై వినయ్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కెతావత్ అర్జున్, భార్య లత పిల్లలతో కలిసి వారింట్లో ఆదివారం నిద్రించారు. లత మెడలో ఉన్న అర తులం బంగారు ఆభరణం కత్తిరించుకుని, రెండు చరవాణులను దుండగులు అదే రోజు రాత్రి ఎత్తుకెళ్లారు. ఉదయం నిద్రలేచి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని కుటుంబీకులు గమనించారు. తమ ఇంట్లో దొంగతనం జరిగినట్లు పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి పరిశీలించారు. ఇంటి లోపల నుంచి పెట్టిన గొళ్లెంను తలుపు సందులో నుంచి తీసి దుండగులు చోరీకి పాల్పడినట్లు లత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

క్రైమ్ కార్నర్

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

సిర్పూర్(మోపాల్), న్యూస్‌టుడే: సిర్పూర్ అటవీ ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని యజమానిపై కేసు నమోదు చేసినట్లు సెక్షన్ అధికారి అబ్దుల్ బాసిత్ సోమవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకోగా గ్రామస్థులు అడ్డుపడటంతో పోలీసుల సహకారంతో అటవీ శాఖ డివిజనల్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. రెండు రోజుల కిందట మల్లారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఇసుకను తీసుకెళ్తుండగా ట్రాక్టర్‌ను సాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఇందులో బీట్ అధికారిణి సంయుక్త, సిబ్బంది ఉన్నారు.

జూదరుల అరెస్టు

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: బాల్‌నగర్‌లోని శ్మశానవాటిక వద్ద సోమవారం జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. వారి నుంచి రూ.3700 నగదు, రెండు చరవాణులు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బీసీల అభ్యున్నతికి కృషి చేస్తాం


నరేందర్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ లింగాగౌడ్‌ను తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్ సోమవారం ఆర్మూర్‌లో కలిశారు. బీసీల అభ్యున్నతికి కృషి చేస్తానని లింగాగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయణ్ని సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి భిక్షపతి, ఉపాధ్యక్షుడు శ్రీహరి, మోహన్‌దాస్, పుష్పాకర్, ప్రకాశ్, భోజాగౌడ్ పాల్గొన్నారు.

ఆర్మూర్

● ఆర్మూర్ ● బాల్కొండ

బాల్కొండలో వాహనాల తనిఖీ


డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్సై నరేష్

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండలో ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేశారు. శిరస్త్రాణం లేకుండా ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారిపై సైతం కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు.

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్) — ఈనాడు సినిమాలు

స్క్రీన్–1 **బహిర్భూమి:** 10.50
మిస్టర్ సెలెబ్రిటీ: 1.30, **చిట్టి పొట్టి:** 4.15
జోకర్ ఫోలీ ఎ డెక్స్: 10.30

స్క్రీన్–2 **దేవర:** 11.00, 2.35, 6.10, 9.45

స్క్రీన్–3 **కలి:** 11.05
జోకర్ ఫోలీ ఎ డెక్స్: 1.15, **దక్షణ:** 4.30
దేవర: 7.00, **రామ్‌నగర్ బన్నీ:** 10.35

స్క్రీన్ 4 స్వాగ్ : 12.00, 3.20, 6.40, 10.00

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా..

94939 26837
98666 11160

నందిపేట్, న్యూస్‌టుడే: నందిపేట్‌లోని హనుమాన్ గల్లీలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. దీంతో మురుగు నీరు రోడ్లపైకి వస్తోంది. కుక్కల బెడద కూడా ఎక్కువగా ఉంది. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము.
- గంగాధర్, కాలనీవాసి

సమాధానం: మురుగు కాలువలను శుభ్రం చేయాలని పారిశుద్ధ్య కార్మికులకు ఆదేశిస్తా. కుక్కల బెడద పరిష్కారానికి కృషి చేస్తా.
- లక్ష్మీప్రసాద్, ఎంపీవో, నందిపేట్

ఆర్మూర్ పట్టణం: కొటార్మూర్ 6వ వార్డులో కుక్కలు, కోతుల బెడద తీవ్రంగా ఉంది. కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.
- యశ్వంత్

సమాధానం: శునకాలకు ఏబీసీ చేసేందుకు ఒప్పందం జరిగింది. ఆ ప్రక్రియను త్వరలోనే ప్రారంభిస్తాం. సమస్య తీరుతుంది. **- రాజు, కమిషనర్, ఆర్మూర్**

సోయా...ఏది సర్కారు దయ!


కమ్మర్‌పల్లిలో ఎండబెట్టిన సోయాబీన్

వానాకాలంలో సాగు చేసిన సోయా పంట చేతికొచ్చింది. అనుకూలమైన వాతావరణంతో పంట దిగుబడి పెరిగింది. ప్రభుత్వం కేంద్రాలు తెరిచి కొనుగోళ్లు చేపట్టాలి. కానీ కేంద్రాల ప్రారంభం ఆలస్యమవుతోంది. దళారుల చేతిలో రైతులు మోసపోయి నష్టాలు మూటకట్టుకునే పరిస్థితి నెలకొంది. మద్దతు ధర వచ్చే పరిస్థితి లేకపోవడంతో పంటను ఇళ్లల్లో నిల్వ చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కేంద్రాల కోసం నిరీక్షిస్తున్నారు.

న్యూస్‌టుడే, కమ్మర్‌పల్లి

కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం

రంగ ప్రవేశం చేసిన దళారులు

ఆర్మూర్ డివిజన్‌లో 10,296 ఎకరాల్లో సోయాబీన్ పంట సాగైంది. ఈసారి వాతావరణం అనుకూలించడంతో ఎకరానికి 10 క్వింటాళ్లపైనే దిగుబడి వస్తోంది. ఈ లెక్కన 1,02,960 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఏటా రైతులు పండించిన దిగుబడుల కొనుగోలు కోసం ప్రభుత్వం కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. కానీ సకాలంలో ప్రారంభించకపోవడంతో రైతుల ఆర్థిక అవసరాల కోసం ప్రైవేటు మార్కెట్‌కు తరలించి తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్నారు.

తక్కువ ధరకు కొనుగోలు

ఈ ఏడాది కేంద్రాల ఏర్పాటులో ఆలస్యమైంది. దీంతో దళారులు రంగ ప్రవేశం చేశారు. మద్దతు ధర రూ.4892 ఉంటే వ్యాపారులు కేవలం రూ4300కే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతు క్వింటాకు రూ 592 నష్టపోతున్నారు. ఈసారి ధరలో తేడా భారీగా ఉండడంతో రైతులు సోయాను అమ్ముకోలేకపోతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు నిరీక్షిస్తూ పండించిన పంటను బస్తాల్లో నింపి ఇళ్లల్లో భద్రపరుస్తున్నారు.

	సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)	దిగుబడి(క్వింటాళ్లు)
ఆర్మూర్	1,841	18,410
మాక్లూర్	18	180
నందిపేట్	940	9,400
బాల్కొండ	32	320
మెండోరా	850	8,500
ముప్కాల్	450	4,500
ఏర్గట్ల	1,100	11,000
భీమ్‌గల్	10	100
కమ్మర్‌పల్లి	2,885	28,850
మోర్తాడ్	1,620	16,200
వేల్పూర్	550	5,500

ఇంట్లో నిల్వ చేశా


బద్దం హారీష్, హాసాకొత్తూర్

నాలుగు ఎకరాల్లో సాగు చేస్తే 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మద్దతు ధర రూ.4892 ఉంటే వ్యాపారులు రూ.4300 మించి కొనడం లేదు. క్వింటాకు రూ 592 చొప్పున రూ 23,680 నష్టపోవాలి. విక్రయించలేక బస్తాల్లో నింపి ఇంట్లోనే నిల్వ చేశాను. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటైతే అమ్ముదామని వారం రోజులుగా నిరీక్షిస్తున్నా.

ఆరు క్వింటాళ్ల నిబంధనల సరికాదు


అనిల్‌రెడ్డి, హాసాకొత్తూర్

వేల్పూర్ ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ఎకరానికి 6 క్వింటాళ్లే తీసుకుంటున్నారని తెలిసింది. ఈ నిబంధన సరికాదు. ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తే కేవలం ఆరు క్వింటాళ్లు తీసుకుంటే మిగతావి ఎక్కడ అమ్ముకోవాలి. పండించిన పంటంతా కొనుగోలు చేయాలి

స్థానికంగా కొనాలి



ప్రభుత్వ సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలి. సొసైటీలకు అప్పగించి కొనాలి. ఒకే చోట కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు ఇబ్బందులు ఏర్పడుతాయి. పంటను తెచ్చి తూకం కోసం నిరీక్షించాల్సి వస్తోంది. మార్కెట్ కమిటీల్లోనే కాకుండా స్థానికంగా కేంద్రాలు ఏర్పాటు చేయాలి.
*** వెల్మ సాయన్న, కమ్మర్‌పల్లి**

ఆర్మూర్‌లో ఏర్పాటు చేస్తాం

వేల్పూర్‌లో సోయా కొనుగోలు కేంద్రం ఏర్పాటైంది. రెండు రోజుల్లో ఆర్మూర్ మార్కెట్ యార్డులో మరో కేంద్రం ఏర్పాటు చేస్తాం. కమ్మర్‌పల్లి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేయడానికి షెడ్డు, ఇతర సౌకర్యాలు లేవు.
రంజిత్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మేనేజర్

రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ


కమ్మర్‌పల్లిలో ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న నర్సయ్య

కమ్మర్‌పల్లి, వేల్పూర్, న్యూస్‌టుడే: రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. కమ్మర్‌పల్లి, వేల్పూర్‌లో సోమవారం నిర్వహించిన మార్కెట్ కమిటీ పాలకవర్గాల ప్రదవీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని, ప్రతిపక్షాల మాటలు నమ్మి ఆందోళన చెందవద్దని సూచించారు. కొత్త పాలకవర్గాలు బాగా పని చేసి రైతులకు మద్దతు ధర లభించేలా చూడాలన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ ఛైర్మన్ సుంకెట బుచ్చెన్న, వేల్పూర్ ఛైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్ ఛైర్మన్ గడ్డం నర్సారెడ్డి, మిగతా డైరెక్టర్లతో కమిటీ కార్యదర్శి మెర్సి ప్రమాణస్వీకారం చేయించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అనిల్‌ఈరవత్రి, డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి, బాల్కొండ బాధ్యులు సునీల్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ రమేశ్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నర్సారెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

సాత్వికకు సన్మానం



ఏర్గట్ల: ఏర్గట్లకు చెందిన సుధనవేణి సాత్విక ఎన్‌సీసీ జాతీయ స్థాయి క్యాంపులో ఎయిర్ పిస్టల్ విభాగంలో పతకం సాధించింది. సాత్వికను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్ రెడ్డి మోర్తాడ్‌లోని ప్రజానిలయంలో సోమవారం సన్మానించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు శివకుమార్, కిసాన్ ఖేత్ మండలాధ్యక్షుడు మోహన్ రెడ్డి, భాను, రాములు, ప్రసాద్ గౌడ్, పాల్గొన్నారు.

దుర్గామాతా.. నమోస్తుతే


మామిడిపల్లిలో లలితాత్రిపుర సుందరిగా దర్శనం ఇచ్చిన అమ్మవారు


ఆలూరు: రాంనగర్ యూత్ ఆధ్వర్యంలో మహాచండీగా అమ్మవారు


ఆర్మూర్ దయానంద్ నగర్‌లో కుంకుమార్చన

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలోని దయానంద్‌నగర్, మండంలోని రాంపూర్‌లో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపాల్లో సోమవారం కుంకుమార్చనలు నిర్వహించారు. మహాలక్ష్మి కాలనీలో కౌమరి పూజ జరిపారు.

బాల్కొండ: మహాచండీదేవి అలంకరణలో దేవికి పూజలు నిర్వహించారు. బాల్కొండతో పాటు మండలంలోని గ్రామాల్లో ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

భీమ్‌గల్: భీమ్‌గల్ పట్టణంలోని అయ్యప్పనగర్ కాలనీలో, బడాభీమ్‌గల్ నవదుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మహిళలు, యువతులు సామూహిక కుంకుమపూజలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కోనాపూర్‌లో సోమవారం దుర్గాదేవి వద్ద సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. హాసాకొత్తూర్‌లో వేడుకలను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. స్వామిని గ్రామ వీధుల్లో ఊరేగించారు.


కిసాన్‌నగర్‌లో


ఆర్మూర్: మహాలక్ష్మి కాలనీలో పూజలో పాల్గొన్న బాలికలు


కోనాపూర్‌లో..


భీమ్‌గల్‌లో..


శ్రీరామ కాలనీలో హోమం..


హాసాకొత్తూర్‌లో..

వీల్‌ఛైర్‌లో సామగ్రి తరలింపు



రోగులను తరలించే వీల్‌ఛైర్‌ను ఏకంగా మందులు, సామగ్రి తరలింపునకు వినియోగిస్తున్న ఘటన ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని డయాలసిస్ కేంద్రం నిర్వాహకులది. వీల్‌ఛైర్‌తో ఎప్పుడు, ఏ అవసరం ఉంటుందో తెలియదు. అలాంటి వాటిని ఇలా ఉపయోగించడం పట్ల ప్రభుత్వాసుపత్రికి వచ్చేవారు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు



కమ్మర్‌పల్లి,న్యూస్‌టుడే: ఉప్లూర్‌లో దమ్మన్నపేట వద్ద పంచాయతీ కుళాయి పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీకి సోమవారం మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించారు. ఈనాడు దినపత్రికలో ‘ మంచి నీటి సహాయకులొస్తున్నారు’ శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి నరేందర్ వెంటనే మరమ్మతులు చేయించారు.

ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పరామర్శ



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గణేష్ కుటుంబాన్ని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. భారాస మండలాధ్యక్షుడు దేవేందర్, స్వామి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

భీమ్‌గల్: భీమ్‌గల్‌లో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ ఫిర్యాదు చేశారు. నకిలీ పత్రాలు ఇచ్చారని, ఎంఈవో అనుమతి ఇచ్చారన్నారు.

శ్రీకృష్ణ మందిరంలో పూజలు

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ శ్రీకృష్ణ మందిరంలో గజ్జ పూజ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. శివం డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గురువు గుజరాతి స్వాతి ఆధ్వర్యంలో నాట్య ప్రదర్శన జరిగింది.

ఆలూరులో హలాల్ నిషేధం

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆలూరు మండల కేంద్రంలో హలాల్‌ను నిషేధిస్తున్నట్లు వీడీసీ ప్రతినిధులు సోమవారం తీర్మానించారు. నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని అధ్యక్షుడు ముత్యం తెలిపారు. నవనీత్, సంతోష, గంగారెడ్డి, శ్రీనివాస్, సుమన్, రాములు, జాన్, మల్లేష్, గంగారెడ్డి, భాస్కర్, నాగేశ్ పాల్గొన్నారు.

వరదకాలువలో మృతదేహం

కోరుట్ల: జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల కేంద్రం శివారులోని వరద కాలువలో వృద్ధుడి మృతదేహాన్ని సోమవారం గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం దొన్నల్‌కు చెందిన నర్సయ్య(70) మృతదేహం గుర్తించారు. ఈనెల 5న నర్సయ్య అదృశ్యమైనట్లు కుటుంబం సభ్యులు మోర్తాడ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వరదకాలువలో గుర్తించిన మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత

రుద్రంగి, న్యూస్‌టుడే: రుద్రంగి మండల కేంద్రం శివారులో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం ఖానాపూర్‌కు చెందిన సింగిరెడ్డి శ్రీధర్‌గా దగ్గర 70 మి.గ్రాల గంజాయి పట్టుబడినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గంజాయి తీసుకొని వేములవాడ నుంచి ఆర్మూర్ వెళ్లే క్రమంలో సోమవారం రుద్రంగిలో పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

సిద్ధులగుట్టకు తరలొచ్చిన భక్తులు


శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ నవనాథ సిద్ధుల గుట్టపైకి సోమవారం సందర్భంగా భక్తులు తరలివచ్చారు. దేవీ నవరాత్రుల సందర్భంగా, గుట్టపైన ఉన్న దుర్గామాత మందిరంలో విశేష పూజలు నిర్వహించారు. చేపూర్‌కు చెందిన భవానీ మాలాధారులు జలాల్‌పూర్ గోదావరి వెనుక జలాల నుంచి అమ్మవారిని పల్లకీలో తీసుకొచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో సిద్ధేశ్వర పల్లకీసేవ చేపట్టారు. అనంతరం భక్తులు అన్నప్రసాదం అందజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదు చేసుకోండి

నందిపేట్, న్యూస్‌టుడే: నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యాయులు ఓటు హక్కు కోసం తమ పేరును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రవీందర్ ప్రకటనలో కోరారు. ఉద్యోగ గుర్తింపు కార్డు, పని చేసే పాఠశాల నుంచి ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఎన్నికల గుర్తింపు కార్డు, పీపీ సైజు ఫొటోతో పాటు సంబంధిత దరఖాస్తు నింపి తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలన్నారు.

మార్కెట్ కమిటీ సభ్యులకు సన్మానం

నందిపేట్: నిజామాబాద్ మార్కెట్ కమిటీ నూతన సభ్యులను సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. జిల్లా కేంద్రానికి వెళ్లి ఛైర్మన్ గంగారెడ్డి, వైస్ ఛైర్మన్ రాంచందర్, డైరెక్టర్ పెంట ఇంద్రుడులను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, నాయకులు వైఎస్ గంగాధర్ పాల్గొన్నారు.

రేణుకమ్మా.. సమస్యలు తీర్చు!

● కుద్వాన్‌పూర్ కొండపై ఆలయంలో వసతులు కరవు ● అవస్థలు పడుతున్న భక్తులు

– న్యూస్‌టుడే, నందిపేట్

కుద్వాన్‌పూర్ కొండపై కొలువైన రేణుకామాత భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. కోరికలు తీరుస్తోందని.. చర్మవ్యాధులను నయం చేస్తుందని ప్రజల విశ్వాసం. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు ఇక్కడికి వచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందుతారు. కానీ భక్తులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటుచేయడంలో దేవాదాయశాఖ విఫలమవుతోంది. అవస్థలు పడుతున్నామని ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి వసతులు కల్పించాలని కోరుతున్నారు.

సౌకర్యాల కల్పనలో అలసత్వం

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన మూడు రేణుకామాత ఆలయాల్లో కుద్వాన్‌పూర్‌లోని మందిరం ఒకటి. ప్రధానంగా ఆదివారం, మంగళవారం, శుక్రవారం భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఏడేళ్ల కిందట కొండపై తాగునీటి ట్యాంకు నిర్మించారు. కానీ నీరు నింపకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో సమీపంలోని పొలాల్లోకి వెళ్లి భక్తులు వంటకు నీరు తెచ్చుకుంటున్నారు. వంట చేసుకోవడానికి నీడ సౌకర్యం లేదు. చెట్లకింద, రోడ్లపైన భోజనాలు చేస్తున్నారు. కొండపైకి రోడ్డు లేదు. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.


కొండపై ఆలయం

ఆదాయం ఉన్నా పట్టింపు కరవు

అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు వివిధ రూపాల్లో కానుకలు ఇస్తుంటారు. దాతలు విరాళాలు ఇస్తారు. కొండపై మేకలు, కోళ్ల కోయడానికి టెండరు రూపంలో ఆదాయం సమకూరుతుంది. దుకాణాలు, తినుబండారాల విక్రయదారుల నుంచి వచ్చే ఆదాయం, ఉత్సవాల సందర్భాల్లో చందాలు వస్తుంటాయి. అయినా అధికారులు భక్తుల అవసరాలు తీర్చడం లేదు.

ఇబ్బంది పడుతున్నాం


- సంతోష్, భక్తుడు నందిపేట్

తరచూ అమ్మవారి సన్నిధికి వచ్చి దర్శనం చేసుకుంటాం. తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. వేసవి, వానాకాలంలో ఇబ్బందులు మరింత ఎక్కువవుతున్నాయి. ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

చెట్ల కింద వంట చేసుకుంటున్నాం


- ఎర్రం మురళి, భక్తుడు, నందిపేట్

అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చి నైవేద్యాలు సమర్పిస్తాం. కొన్ని షెడ్లు ఉన్నా అవి సరిపోవడం లేదు. చెట్ల కింద వంటలు చేసుకోవాల్సి వస్తోంది. గతంలో కూడా పాలకులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఇప్పుడైనా స్పందించి సమస్యలు తీర్చాలి.

ప్రభుత్వానికి నివేదిక పంపించాం

- రవి, కార్యనిర్వాహక అధికారి, దేవాదాయ శాఖ

కొండపై తాగునీటి ట్యాంకులోకి పైపులైను వేశాం. చాలా దూరం నుంచి నీరు తీసుకురావాల్సి ఉండడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు రాగానే ఒక్కొక్కటిగా అన్ని పనులు చేపడతాం.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఏర్గట్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులపై మూడో విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను సోమవారం నిర్వహించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయాగౌడ్, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు. 2023-24 సంవత్సరపు వివరాలను ఆడిట్ అధికారులు చదివి వినిపించారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు క్షేత్ర సహాయకులు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శివచరణ్, ఏపీవో వెంకటేశ్, వివిధ గ్రామాల క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్‌డీవో సాయాగౌడ్

చికాగోలో బతుకమ్మ సంబురాలు

బాల్కొండ, న్యూస్‌టుడే: అమెరికాలోని చికాగోలో ముప్కాల్ మండలం నాగంపేట్, తదితర గ్రామాల నుంచి వెళ్లి అక్కడ నివాసముంటున్న మహిళలు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఆదివారం భక్తి శ్రద్ధలతో బతుకమ్మలను పూలతో పేర్చారు. అనంతరం పాటలు పాడుతూ ఆడారు.





నందిపేట్‌లో ..

నందిపేట్: నందిపేట్ గ్రామంలో బుక అయ్యవార్ల సంఘం భవనంలో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సంఘం మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.